

# కారప్పూస పొట్లాం

పోరంకి దక్షిణామూర్తి

కార్తవీర్యుడు క్రాపుసర్దుకుని సరిగ్గా గుమ్మం దాటబోయేసరికి పాపవచ్చి కాళ్ళకు చుట్టేసుకుంది.

"ఉండమ్మా మరీ! ఆఫీసుకెళ్ళద్దూ?" అంటూ లాలనగా అడిగాడతను. పాప తల అడ్డంతిప్పింది. "నేను పోనియ్యి!" అంది.

"మా అమ్మవుకదూ! సాయంత్రం నీకు కారప్పూస తెచ్చిపెడతాను. ఏం?" అన్నాడు.

"కా ర పూ ్ప స కా దు—పు ప్పు లు కావాలి!" అంది పాప.

"పప్పులా? సరే!"

"పు ప్పు లం తే పప్పులంతా వేంతి? మాతల్లావా నీకు?" అంది పాప.

"లావే పా పా! నువు చెపుతావా మరి?" అన్నాడు వాళ్ళనాన్న

"నేనేంచెప్ప! బళ్లో చెవుతాలు!" అంది పాప.

"అయితే బళ్లోకే వెడతాలే! నువు లోపలికెళ్ళు!"

"మలి పుప్పులో?"

"తెస్తాలేవే తల్లీ! నన్ను వెళ్ళనియ్యి!" అన్నాడు, కొంచెం విసుగ్గా.

"పుప్పులంతే తెలుసా?"

"పుట్నాలు!"

పాప కిలకిలా నవ్వింది. "ఏక్కిలాయి! పుప్పులెవలేనా తింతారేంతి? ఇం...త పొలుగుంతాయి!" అంటూ బారచాపి చూపిచింది.

"ఆసి గడుగ్గాయీ! అవా నీక్కావలసినవీ?" అంటూ నిలువునా ఆశ్చర్యపోయాడానాన్న. "పుప్పులు కాదమ్మా అవీ; ప్రూపులు! ఏది, మళ్లీ అను! ప్రూ...పు...లు!" అంటూ చెప్పాడు.

"పు...ప్పు...లూ!" అంది పాప

"ఇప్పులిత్తావా మలి?"

"ప్రూఫంటేఏమిటో, నువ్వు నా అంత అయాక తెలుస్తుంది. అప్పుడిస్తాను," అన్నాడతను.

"ఏ మొద్దు! నాకిప్పుడే తెల్సు!"

"అయితే చెప్పు చూద్దాం!"

"పుప్పులంతే తప్పులు! పుత్తకాలు కుత్తి చవుతుంతాలు!" అంది పాప.

"మా బాగా చెప్పావే! ఏది, ఒక్కముద్దియ్యి! ఇంకోటి—ఈ బుగ్గమీద!"

"నేనియ్యి! మీ సా లు గుచ్చుతుంతున్నాయి!"

"పోన్లె! రేపు మీసాలు తీసేశాక ఇద్దువుగాని. అమ్మ పిలుస్తోంది. ఇంక ఇంక లోపలికెళ్ళు," అన్నాడు, మరిపించడానికి.

అయినా పాప వదిల్తేనా! తల అడ్డం తిప్పుతూ కాళ్ళు నేలకేసి బాదుతూ "నాకు పుప్పులేకావాలీ!" అంటూ రాగాలు మొదలుపెట్టింది.

ఈ రాగాలు సూటిగా వంటింట్లోకి వెళ్ళి తొందరపనిలో ఉన్న మామ్మగారి చెవినిపడి ఆవిణ్ణిలేపి మనవరాలి దగ్గిరికి లాక్కొచ్చాయి. వస్తూవస్తూ, మామ్మగారు పొయ్యికి పాలిష్‌కొడుతున్న అలుగుడ్డని కూడా ఆవిడచేత్తోటే తీసుకువచ్చాయి.

"ఏరా అబ్బాయ్! కుర్రనాగమ్మనలా ఏడిపించపోతే ఏవేనా చేతులో పెట్టి ఊరుకోబెట్ట రాదుట్రా"? అంటూ సాగదీసుకుందావిడ.

"నీ మనవరాలికి కావలసినవి పెసలూ పప్పులూ కావటమ్మా! ప్రూ పు లు కావాలిట!" అన్నాడు కార్తవీరుడు.

"వాటికేంభాగ్గెం? దొడ్లో రెండు గన్నేరుపూలు కోసిపెట్టు!" అంటూ పురమాయించిందావిడ.

"పువ్వులు కాదమ్మా! ప్రూఫులు! పుస్తకాలు అచ్చువేసేటప్పుడు తప్పులు

దిద్దడంకోసం ఏంచేస్తారంటే—సన్నగా, పొడుగ్గా ఉండే రేకు చేటల్లో, పంక్తులుగా కూర్చిన పోతక్షరాల మీద అప్పడాలకర్రలాంటి దాంతో తారురంగు సిరాపూసి, పేడరంగు కాయితాలదాని మీద ఒత్తి నకలు తీస్తారు. అదీ ప్రూఫంటే! నీ మనవరాలికి కావలసిన వవీ!" అంటూ వివరించాడు కార్తవీర్యుడు,

"మా అమ్మే! మా తల్లె! వేలెడున్నావో లేవో నీకెన్ని తెలుసునే అంటూ, అభిమానం పొంగిపోతుంటే, ముందుకు వచ్చి "రేపొద్దున్న. మీ నాన్నలాగే నువు కూడా అచ్చాఫీసులో ఉజ్జోగం చేస్తావేమిటే?" అంది, అమ్మాయి ఎమ్మే ఈడేరి, ప్రూఫుటిల్లు మెట్టబోతున్నంత సంబరపడుతూ.

"చాల్లె! చెయ్యక చెయ్యక, ఇదీ అక్కడే చెయ్యాలీ? అంటూ సాగదీసుకున్నాడు ఆవిడగారి కొడుకు. "సరే, నేను ఆఫీసుకు వెళ్తున్నా కాని—దీన్ని వాళ్ళమ్మకి అప్పజెప్పు!" అంటూ మళ్లీ కదిలాడు.

ఆమాటకి మామ్మగారు మరో అడుగు ముందుకువేసి మనవరాలిరెక్క అందుకోబోయేసరికి చేతిలో అలుగ్గుడ్డ చిందులు, గౌనుమీదపడ్డా, మొహంమీద పడకుండా తప్పించుకుని కాళ్ళు నేలకేసి బాదడం మొదలెట్టింది పాప.


"ఇదుగో చూశావా! గౌనుకాస్తా పాడయిపోయింది. ప్రూఫంటే అలుగ్గుడ్డ లాంటిదమ్మా! నువు ముట్టుకోకూడదు!" అంటూ అతను సముదాయించబోతుండగానే మామ్మగారు చిరాకుపడుతూ "ఏవిఁ ఆంద్రెబ్బే నీకు" అంది. ఆ చేతోనే పాపని దొరకబుచ్చుకుని లోపలికి లాక్కెళ్ళింది.

కార్తవీర్యుడు వీధిలో పడి, అర నిమిషం ఆగి సిగరెట్టు ముట్టించి గబగబా నడక ప్రారంభించాడు.

తూర్పుదిక్కు జూఆలజీ పుస్తకం కవరుపేజీలాగుంది. చీపురుకట్టాయుధులు ఎప్పుడూలేంది, ఆవేళ తొందరగానే వీధివిహారం ప్రారంభించారు. బడ్జెట్ సెషన్ అనేసరికి హఠాత్తుగా పెరిగిన సరుకుల రేట్లలాగ రోడ్డుదుమ్ము గగనవిహారం చేస్తోంది. అయినా ఇతడు కార్యశూరుడు కాబట్టి, ఆ దుమ్ము కన్రెప్పలగుండా లోపలికి దూసుకుపోలేక జెరంత కిందికి నాసాపుటాల్ని స్పందింపజేసి నసాళమంటింది. అయినా ఆతడికి వచ్చినవి మూడే మూడు తుమ్ములు. అటువంటి సమయంలో జేబులో రుమాలు ఆజీలుగా లేనందుకు కించపడక, కుంభంపట్టి పురోగతిసాధించాడు. పెద్దరోడ్డెక్కాడు. అటూ ఇటూ పరకాయించాడు. తను అడ్డంవల్ల ఏఒక్క వాహనానికీ అపాయంకలగదని నమ్మకం కుదిరాక రోడ్డుదాటబోతుండగా వెనకనించి కేక








వినిపించింది. టక్కుమని ఆగిపోయాడు.

"స్త్రయికార్దుకోసం ఉరికేవాడిలా ఏమిటా తొందర?" అంటూ వెనకాలే వచ్చి బుజంమీద చెయ్యివేశాడు మాధవరావు.

కార్తవీర్యుడికి చద్దెన్నం తినే అలవాటుపోయి చాలా కాలమయింది. పొద్దున్నే బియ్యపురవ్వ ఉప్మా తినేవాడు. కాని బియ్యం ధరకూడా తెలుగుసినిమా తారల సౌష్ఠవాన్ని ఆదర్శంగా తీసుకుని దినదిన ప్రవర్ధమానమవుతూ వచ్చింది. అయిందే అనుకుందాం, కరివేపాకట్ట ధరకూడా దాన్నిచూసే పెరగాలా? కార్తవీర్యుడికి చిర్రెత్తుకొచ్చింది—కరివేపాకట్టనీ కరిమింగిన వెలగపండునీ తనతో కలిపి తిట్టుకుని ఒంటిపూట నిరాహారదీక్ష ప్రారంభించాడు. ఆ దీక్ష పట్టినవాళ్ళకి నిమ్మరసం నిషేధంలేదు. అలాగే ఇతనికి కాఫీ నిషేధంలేదు. గంటదాకా దాన్నే, హరించిపోకుండా చూసుకుంటాడు—మధ్యమధ్య మంచినీళ్ళ దిగబోస్తూ. మొత్తంమీద, పూర్వాహ్ణంలో అతను తన బరువు తప్ప మరొకళ్ళది మొయ్యడానికి సిద్ధపడడు. అందువల్ల మాధవరావు చెయ్యి మెల్లిగా కిందికి జారుస్తూ చిరునవ్వొకటి పెదిమిలకి మేకప్ చేసుకుని, "తొందరగా పద టైమయిపోతోంది!" అంటూ అతన్ని ముందుకు లాక్కుపోయాడు.

రోడ్డు దాటీదాటగానే కనిపించేది జహంగీరు కిళ్లీ కొట్టు ఆ కిళ్లీ కొట్టంటే వాళ్ళకి వల్లమాలిన ప్రేమ. అంతేకాదు, చరిత్ర పునరావృతమవుతూ ఉంటుందని రాసేపెట్టికారుకనక, ముందుముందు ఈ జహంగీరే భారతదేశానికి పాదుషా అవుతాడనివీళ్ళ నమ్మకం. ఈనమ్మకానికి బలం, అతగాడి బహుముఖవ్యక్తిత్వం, దొడ్డతనం. ఒకవేపు కిళ్ళీలు కడతాడు. మరోవేపు సిగరెట్లందిస్తాడు; ఇంకోవేపు పత్రికలమ్ముతాడు, మరోవేపు నస్యం కడతాడు. అందర్నీ ఒక్కచూపులోనే కలయజూస్తూ అందరి అవసరాలూ ఏకకాలంలో తీరుస్తాడు, ప్రింటింగూ ఫోల్డింగూ కటింగూ పాకింగూ ఏక కాలంలో చేసే యంత్రంలాగ. అలాగని మరమనిషా ? కళ్ళలో ఉత్సాహం. పెదిమిలమీద చిర్నవ్వు. చేతుల్లో చురుకుదనం—రెండో ఆట సినిమా చూసొచ్చింతరవాత కూడా జహంగీరులో చూడవచ్చు. ఆ చిర్నవ్వు కింద తళతళలాడే గెడ్డం నయాగరా జలపాతంలా, నాణెమయిన గ్లేజ్‌పేపర్లా కనిపిస్తుంది. అతని దుకాణం ఒక అయస్కాంత క్షేత్రం కావడానికి ఇవన్నీ కారణాలే. రోడ్డుదాటి వాళ్ళిద్దరూ అక్కడే ఆగారు–గాలీ ప్రూఫ్‌లోంచి తిన్నగా ఫైనల్ ప్రూఫ్‌కు వచ్చినట్టు, పైన వేలాడగట్టిన 'తారా తోరణాలు' కునేగా మరికొళందు వెదజల్లుతున్నాయి. 'ఈ శతాబ్దం కడపటి కల్లా ఇంటింటికో టీ వీ. సెట్టు'—పక్కన ఉన్న ఒక పత్రికలో తాటికాయ అక్షరాల్లో బ్రహ్మాండమైన జోకు. "రేజర్ సెట్టు అనడానికి బదులు టీ వీ. సెట్టని పడలేదు కదా ?" అన్నది కార్తవీర్యుని అనుమానం.

"చూడు జహంగీరూ ! ఈవేళ ఫస్టాస్ ప్రూపులు కట్టాలోయ్ !" అంటూ పాదుషాకి హుకుం జారీచేశాడు మాధవరావు.

"జరూర్ సాబ్ ! అబీ దియా !" అంటూ పక్కకి తిరిగాడతను.

"మాధవా ! ప్రూపులు దిద్దటమే కాకుండా నమలడం ఎప్పుడు మొదలెట్టావు ?" అంటూ అడిగాడు కార్తవీర్యుడు. మాధవరావు నవ్వాడు.

"సర్వం ప్రూఫ్‌మయం జగత్–" అన్నారు కదా భాయ్ !

ఇంతలో జహంగీర్ర్–"యే లీజియే సాబ్ !" అంటూ పొడుగాటి కట్ట ఒకటి అందించాడు.

"ఏకంగా ఇన్ని కట్టించేశావు? ఎన్ని రోజులకేమిటి" అని అడిగాడు కార్తవీర్యుడు.

"ఎన్నో రోజులా ! దంతసిరి ఉండాలేగాని ఒక్క పూటలో ఊదెయ్యం ?" అంటూ గొప్పవాడి చూపొకటి వాలుగా విసిరాడు మాధవరావు. విసురుతూనే–జహంగీరు బహూకరించిన కట్టలో



జాంగ్రీలుగట్రా ఉన్నాయేమో అన్నట్టు సుతారంగా విప్పాడు. విప్పీవిప్పగానే, గుడ్లు మిటకరించాడు; పెదిమలు బిగబట్టాడు; బిర్రబిగిసిపోయాడు.

ఇప్పటిదాకా నిక్షేపంలా ఉన్నాడు–ఇంతలోకే ఏవయింది చెప్మా !– అనుకుంటూ మాధవరావు చేతిలో ఉన్నది చూశాడు మిత్రుడు. చూస్తే ఏముంది ? ప్రూపులకట్ట ! "ఆంధ్రసాహిత్యంలో" అబల : అవయవ వర్ణనల అడ్డుకోత" అన్న పిహెచ్.డి. థీసెస్ తాలూకు ప్రూఫులూ ఒరిజనల్సూ కనిపిస్తున్నాయి.

"ఏమిటిది మాధవా ?" అనడిగాడు.

"మనదే ! రాత్రి ఎనిమిదింటివాకా ప్రెస్సులో దిద్దగా మిగిలినవి ఇంటికి పట్టుకెళ్ళి తరవాయి పూర్తిచేద్దామని నేనే కట్టకట్టాను. ఇంటికొచ్చేటప్పుడు, ఈ షాపుదాకా చేతిలో ఉండడం గుర్తుందిస్మీ ! తరవాత దాని సంగతే మరచిపోయాను. ఈ జహంగీరు దీన్ని పదిలంగా దాచిపెట్టి ఇచ్చాడు కనక సరిపోయింది కాని లేకపోతే ఆ ఒరిజనల్సు ఎక్కణ్ణించి తెచ్చి చచ్చేది?" అంటూ–

"జహంగీరూ ! నువ్వు చాలా మంచివాడవయ్యా !" అన్న మాటల్లో వీలయినంత కృతజ్ఞత చూపించడానికి ప్రయత్నించాడు మాధవుడు.

ఈ హోమ్‌వర్కు ఎప్పుడో కొంప ముంచుతుందని అనుకుంటూనే ఉన్నాను ! ఇక టైమవుతోంది!" అంటూ ఉండగానే జహంగీరు ఇద్దరికీ కిళ్ళీలూ, కార్తవీర్యుడి కొక సిగరెట్టుపెట్టీ అందిందాడు. అప్పుడిక, యాభై వేల కాపీల భౌతిక శాస్త్రం ఏకటాకీన కొడుతున్న రష్యన్ మిషన్‌లాగ చకచకా చకాచకా నడక సాగించారు.

భరణంపోయిన ముసలి నవాబులాంటి భవనమది. సోషలిజం కూర్చున్న ఇంపాలా కారు నేరుగా లోపలికి రావటానికి తెరచినట్టు పెద్ద గేటుంది. ఆ గేటుకు నిలువెత్తున స్ట్రిప్‌టీజ్ డాన్సర్ పోజుల్లాగ రకరకాల ఒంపుసొంపుల అక్షరాలతో కళ్ళు జిగేలుమనిపించే వన్నెవన్నెల సైనుబోర్డుంది. ఆ దారినిపోయేవాడు అరవయ్యొకటోసారి ఆ వేపు చూసినా 'జ్యోతిలక్ష్మి ప్రెస్సు' అన్న పేరు చదవకుండా పోడు. అలా పోగలిగిన కొద్దిమందీ అందులో పనిచేసేవాళ్లు. ఇందాకా చకచకా నడక ప్రారంభించిన వాళ్ళిద్దరూ ఈ గేట్లో అడుగుపెట్టి, సలాంకొట్టిన చౌకీదారుకు మళ్లీ సలాం పెట్టి లోపలికి ప్రవేశించారు

వాళ్ళు ప్రవేశించిన రంగం, అప్పుడే తెరతీసిన నాటకరంగం. కేసుల్లో తలదూర్చిన కంపోజిటర్లొకచోట, ఇంపోజు చేసిన ఫారాలు టకటకా పొడుస్తున్న బైండర్లొకచోట, రాజుగారి గుర్రాల్ని మాలీసుచేస్తున్నంత మర్యాదగా మిషన్లు శుభ్రంచేస్తున్న వాళ్ళు ఇంకొక

చోట - ఎవరివనుల్లో వాళ్ళు మునిగి ఉన్నారు.

కుర్చీ దుమ్ము దులుపుకుని, ప్రూఫులు ముందుకు లాక్కుని కూర్చున్నాడు కార్తవీర్యుడు. 'బంతిముక్కు కలం' చేతబట్టి ప్రూఫ్‌మీద శ్రీరామ చుట్టాడు. చుట్టాడో లేదో 'హాచ్' అంటూ తుమ్ము వినిపించింది. సదరు తుమ్ముకుకర్త అయినవాడు భర్తకు ఎదురుగ్గానే నిలుచుని ఉన్నాడు.

"ఏంది అగమయ్యా! సరిదిగిట్టయిందా?" అంటూపరామర్శించాడు కార్తవీర్యుడు.

"సేటు రమ్మంటుండు సార్!" అని అగమయ్య సమాధానం,

"రమ్మంటున్నాడూ? ఫోన్లోకా?"

"లేలే! అద్రల కూసున్నడుసార్!"

"ఏం చేస్తున్నాడు?"

"గుర్రాల్లెక్క లేస్తుండు!"

"ఔనన్నట్టు! బెంగుళూరు సీజనొచ్చిందికదూ! పదపద!" అంటూ లేచాడు వీర్యుడు.

బెంగుళూరు గుర్రాల కాళ్ళలోకి తల దూర్చిన లింగయ్యసేటుకు కార్తవీర్యుడి రాక గమనించే టైములేదు. గోల్డెన్ బర్డు, రోజ్‌మేరీ, ప్రేమ్‌విహారీ-ఈసారికూడా కన్‌ఫ్యూజ్‌చేసేస్తున్నాయి. మూడుకు మూడూ చాకుల్లాటి గుర్రాలు, అయితేనేం? సరిగ్గా తను దేనిమీద కాస్తాడో ఆనాడు అదే చీదేస్తుంది. మొన్నటి మాటు ఏమయింది? పదివేలది గవర్నమెంటు బిల్లొకటి ప్యాసయింది. చెక్కుమార్చాడు. వర్కర్లు తన పెండర్లు కనక, రేసుగుర్రాల్లా పరిగెత్తుకుపోలేరు కనక, వాళ్ళ జీతాల సంగతి మరోబిల్లు ప్యాసయాక చూడొచ్చుకదా అని-మూడు గుర్రాలమీద మూడేసి వేలు పెట్టాడు. పోనీ ఒకటయినా వచ్చి చావచ్చా? ప్రేమ్ విహారీ ఒక్క 'లెగ్గు'లో కూలబడ్డాడు. ఆ చచ్చుగుర్రం-"యాపుల్ ఆఫ్ది అయ్" వచ్చి కూర్చుంది.

"నియ్యవ! ఏమిసతాయిస్తున్నదయ్యా!" అనుకున్నాడు లింగయ్యసేటు

"ఎందుకో పిలిచారట!"

"ఇగో కార్తీరుడుగారూ! గా కొండ్రావు ఫోన్‌చేసిండయ్యా! పురుపుల్లకాన మిస్టేక్కులొస్తున్నయంటదేంది? టర్నుషల్లనే ఉంచుతున్రంట; ఔరు, రాంగ్‌ఫాంట్లు పడతనే ఉన్నయంట! పని గూడ ఆల్చెమయితున్నదంట! ఏందయ్యా యిది? పైసలు పున్నెనికొస్తున్నాయి?"

"కంపోజిటర్లకు చెప్పానండి, ఈ సార్నించి కొండ్రావుగారికి పంపే ప్రూఫు ముందుగా నేను చదివి మరీ పంపుతాను!"

"గదంత నాకెరికలేదు! మీరు మీరు ఏమన్న చేసుకోండ్రి! నాకు పనిగావాలె! ఏమంటున్న? పని! పని!" అన్నాడు సేటు పేపర్‌వెయిటుతో బల్లమీద తాళం వేస్తూ.

'పని, పని' అంటూంటే 'మనీ,



మనీ' అన్నట్టు వినిపించింది కార్తవీర్యుడికి.

"పుస్తకం మొదలుపెట్టేముందు కొన్ని వాంటింగ్స్ లిస్టురాసి ఇచ్చాను మీకు! ఈనాటివరకు వాటిని తెప్పించక పోతిరి. ఉన్నవేమో అరిగిపోయాయి. వాటిలో సరిపెట్టుకుందామంటే కుదిరి చావటంలేదు. నాలుగు పేజీలు కొట్టడం, టైపు డిస్ట్రిబ్యూట్ చెయ్యడం, తరవాత నాలుగు పేజీల్లోనూ ఉన్న టర్నుప్పులూ రాంగ్‌ఫాంట్లూ తీసేసి ఇవి చొప్పించడం-ఇల్లా సాగుతోంది పని. అక్కడికీ మిషన్ ప్రూఫులు నేనే చూసి స్ట్రయికార్డరిస్తున్నాను. టైపులు సరి అయినవి పెట్టుకోకుండా ఎంతవరకూ నెగ్గుకొస్తాం చెప్పండి!"

"గదంత నాకు చెప్పకు. టైపులన్ని మంచిగుండేతట్టయితే నివ్వేంటికయ్యా ఈడ నెలకు నూటేపయి రూపాలు తీస్కుంట? ఏవన్న తక్కువడితె, ఏరే ప్రెసులల్ల కెల్లి అడుక్కుని తెచ్చుకోవాలె. ఇన్నవా? ఈనెల పదేను తారీక్కు కొండ్రావు పని పూర్తిగాకుంటే జీతాలు పడయి. ఏమంటున్న? ఇయ్యాల్టి సందిగా పురుపులు నివ్వే కొండవోయి-ఆయన తాన కూసోని దిద్దించుకొని, స్టయికొడరు తీసుకొని రావలె! లేకుంటె ఇజ్జత్ పోతది ఆ!" అన్నాడు ఫైనల్‌గా.

మళ్ళీ గుర్రాల కాళ్ళమధ్య తలదూరుస్తూ.

"ఇజ్జత్" అంటే బెంగుళూరు రేసు. గుర్రమాండీ?" అని అడగాలనిపించింది కార్తవీర్యుడికి, అయినా "ఈ రేసు దగ్గిర రేసు గొడవ నాకెందు" కనిపించింది. వెనక్కి తిరిగొచ్చేశాడు.

"గదిలోంచి యుగళగీతం వినిపించింది; ఏమిటోయ్ సంగతి?" అన్నాడు మాధవరావు.

"ఈ రోజునుంచి మనకి పాదయాత్ర మొదలోయ్" అన్నాడు మిత్రుడు.

"ఏదన్నా అర్జంటు పని పడిందేమిటి?"

"ఆ కొండల్రావుగారి కొలువుకు పోతున్నాను."

"కొండల్రావంటే-" అంటూ జ్ఞాపకం చేసుకుంటూ "ఆంధ్రప్రదేశంలో పశుపోషణ అభివృద్ధి గురించి పుస్తకం రాశాడూ-ఆయనేనా?" అని అడిగాడు.

"ఔను; మంచివాడు సీ్మ!"

"ఈ హిల్‌లార్ మంచి ప్రోగ్రెసివిస్ట్ లాగున్నాడోయ్!" అన్నాడు మాధవరావు.

"ఏంపాపం?"

"మనుషుల పోషణ పూర్తయిపోయిందిగా. ఇంక మిగిలింది పసువుల పోషణ ఒక్కటే! ఏం?"

"అదికాదు మాధవరావ్! గవర్నమెంటు బడ్జెట్టులో పశుభర్తృత్వ శాఖ హెడ్డు కింద ఎలామెంటుందిట! అది తెలిసి ఈయన-పాతికవేలు తీసుకుని ఓ పుస్తకం రాయమని గవర్నమెంటుచేత అడిగించుకున్నాడు. నాలుగు నెల్లలో వెయ్యిపేజీల గ్రంథం రాశాడు.

"మరో పాతికవేలిస్తే, పచ్చి మిరపకాయల గురించి కూడా పన్లోపని రాయలేకపోయేవాడా?"

"రాయలేక పోవడమేం ఖర్మ? పచ్చిమిరపకాయనీ పరమాత్మనీ పక్కపక్కన పెట్టి కంపారిటివ్ స్టడీచేసి మరీ రాస్తాడు."


"సరే సరే, వెళ్ళిరా! నీకూ్కడా కాస్త అబ్బుతుందేమో చూద్దాం!" అని అతనికి లీవు శాంక్షన్ చేసి, అవయవ వర్ణనల ప్రూఫుమీద భూతద్దం పెట్టుకుని చదవడం మొదలుపెట్టాడు మాధవరావు.

ఎన్. ఆర్. కొండల్‌గారి గేటు తెరిచే ఉంది. కాపలా కుక్క 'కైజరు' కార్తవీర్యుడి దగ్గిరకి ఉరుకొ్కచ్చి, ప్రూఫుల వాసన పోల్చుకుని, పరవాలేదన్నట్టు అతన్ని ఒదిలేసింది.

"రావయ్యా! వీరయ్యా! పొద్దుట్నించి నీకోసమే చూస్తున్నాను" అంటూ కుర్చీ చూపించాడు కొండల్రావు. పశుపోషణ ప్రూఫులు ఆయనకి అందించి అతను కూర్చున్నాడు.

"మన పశుపోషణ ఎంతవరకూ ప్రోగ్రెస్ అయిందోయ్?" అంటూ ప్రూఫులకట్ట విప్పాడు కొండల్రావుగారు.






"పదో ఫారంలో ఉన్నామండి!"

"ఇంకా పదో ఫారమయితే ఎల్లాగయ్యా? రేపొ్పద్దున గవర్నమెంటడిగితే ఏం చెప్పుకోవాలి? అబ్బెబ్బే! మీపరస నాకేం నచ్చలేదు!"

ఉన్న ఇబ్బంది కొండల్రావుగారికి చెప్పేద్దామని నోటిచివరికి వచ్చిందతనికి. కాని గుర్రాల కాళ్ళమధ్య ఇరుకు్కన్న సేటుమీద పుట్టెడు సానుభూతి పుట్టుకొచ్చి, తమాయించుకుని, వెర్రి నవ్వొకటి నవ్వాడు.

"మీ ప్రొప్రయిటరుతో మాట్లాడాను. రేపట్నించి నువ్విక్కడే ఉండి అన్నీ నాకు ఎక్స్‌ప్లెయిన్ చేస్తూంటే, ఎప్పటికప్పుడు ప్రూఫులు దిద్దేసి, స్టొయికార్డరు ఇస్తూ ఉంటాను. తెలిసిందా?" అన్నాడు కొండల్రావుగారు, కొత్త చుట్టమునిపంట కొరుకుతూ.

"నాదేముందండి? మా సేటు ఎంత చెబితే అంతేనండి :"

"మీ సేటు నామాట కాదనడయ్యా! చేసిన ఉపకారం అందరూ మరచిపోరు!"

"అలాగేనండి! కొద్దిగా మంచినీళ్ళు ఇప్పించండి! ఇక్కడే కూర్చుంటాము."

"దానికేంభాగ్యం?" అంటూ, పక్కకి తిరిగి "ఒరే! నూకరాజూ!" అంటూ పిలిచాడు, ఆ పేరుగలవాడు వెంటనే అక్కడ హాజరయ్యాడు.

"దండ; వండబ్బాయిగారూ!" అంటూ నమస్కారం పెట్టాడు.

"ఏం నూకరాజూ! కులాసాగా ఉన్నావా?" అంటూ పలకరించాడు కార్తవీర్యుడు.

"ఆఁ!" అంటూ నవ్వాడతను.

"ఒరే! మన దొడ్లో పెద్ద నిమ్మ ఉంది చూశావూ!"

"ఆఁ!"

"రెండు కాయలు కోసి తెచ్చి, అమ్మగారికిచ్చి రసం తీసి ఇమ్మన్నానని చెప్పు!" అంటూ కొండ్రావుగారు పురమాయించాడు.

"అల్లాగేండి!" అంటూ నూకరాజు నిష్క్రమించాడు.

"ఏవయ్యా! నాకు తెలియకడుగుతాను నా మూలంగా ఏదో ఒకరకంగా మీ ప్రెస్సు కింత డబ్బు ముడుతోందికదా! నా ప్రూఫులో కూడా ఇన్ని టర్నప్పు లుంటే ఎల్లాగయ్యా?" అంటూ కార్తవీర్యుణ్ణి నిలదీసి అడిగాడు కొండ్రావుగారు.

"వాంటింగ్స్‌కి ఆర్డరిచ్చామండి! ఇంకా రాలేదు!"

"ఆ మాట ఎన్నాళ్ళనించి చెప్పటం లేదు! పని మొదలయినప్పటినించి ఒక్కటేపాట! మీరేం బాగుపడదలచుకో లేదా?"

"టైప్ ఫౌండ్రీవాళ్ళు ఆలస్యం చేస్తున్నారండీ!"

"ఎందుకు చేస్తున్నారంటావ్? ఈ తెలుగు ప్రెస్సులకి తన ఫౌండ్రీ తప్ప మరొకటి గతిలేదని! తీర్చవలసిన బాకీలు మీరు మురగబెట్టికూర్చుంటారని! నువ్వు లక్ష చెప్పు, వెయ్యి చెప్పు! మన వాళ్ళొట్టి చవటదద్దమ్మలోయ్! వాళ్ళు చేసుకోనూలేరు; ఇంకొకళ్ళ చేత చేయించుకోనూలేరు!

చూడగా చూడగా ఈ ఊళ్లో మకాం ఎత్తేసి మళ్లీ మెడ్రాసు పోదామని పిస్తోంది!" అంటూ ఉపన్యాసానికి కొంత విరామమిచ్చాడు కొండ్రావుగారు. కార్తవీర్యుడు నవ్వుకున్నాడు—"ఆయనా మనలోవాడే కదా!" అని.

ఇంతలో నూకరాజు వచ్చాడు.

"అమ్మగారికి చెయ్యి ఊరుకోలేదంటండి! నన్నే కలిపి తీసికెళ్ళమన్నారండి!" అన్నాడు.

"సరే! ఆ మంచుబీరువాలోని నాలుగుగడ్డలు తీసి గ్లాసుల్లో వేసి తీసుకురా!"

"అల్లాగేనండి!" అన్నాడు నూకరాజు, రిఫ్రిజిరేటర్ దగ్గిరికి వెళ్తూ.

ఉపన్యాసం తరవాయిభాగం సంగతి మరిచిపోయి కొండ్రావుగారు ప్రూఫ్‌లో పడిపోయాడు. "ఈ ఒరిజినల్స్ తీసుకుని నువ్వు చదువుతూ ఉండు; నేను దిద్దుతూ ఉంటాను!" అంటూ కార్తవీర్యుడికి ఒరిజినల్స్ అందించాడు.

"The Gowdi Buffaloes yield good quantities of milk ..." అంటూ ఇంకా చదవబోతున్నాడతను.

"ఆగాగు! గౌడీ బఫెలోస్ అని చదివావా?"





"చదివానండి!"

"మీ కంపోజిట రెక్కడో అఖండుడిలా ఉన్నాడోయ్! గౌడి గేదెని పట్టుకుని గౌరిదేవిని చేశాడు!"

"ఈ తప్పు గాలీలోనే దిద్దానుసార్! కారీబౌట్ అవలేదన్నమాట!" అన్నాడు కార్తవీర్యుడు.

"వెనకటికోసారి, మీ కంపోజిటర్ లాంటి వాడే—న్యూస్‌పేపర్లో తాటికాయక్షరాల హెడ్డింగుంటుంది చూడు—అందులో 'జాతిపిత గాంధీజీ అస్తమయం' అని కూర్చాట్ట. ప్రూఫ్‌రీడరు నిద్రకళ్ళతో ఉండి స్ట్రయికార్డరిచ్చాట్ట! ఇకచూసుకో ఎంతగొడవయిందో!"

"ఔనటండి! ప్రెస్సుల్లో ఇల్లాటి అప్పుతచ్చులు చాలా వస్తూంటాయండి. ప్రెస్ కాపీ ఛండాలంగా ఉండి కొన్ని, కంపోజింగు తొందరలో కొన్ని, సరిగా ఉన్న అక్షరాలే స్ట్రయిక్ చేసేటప్పుడు జారిపోయి కొన్ని, సేటుగారి సతాయింపు లెక్కువయినప్పుడు కొన్ని, నెలదాటి పదిహేను రోజులయినా జీతాలు పడక కొన్ని, ఎక్స్ట్రావున్నులూ ఓవర్‌టైమ్ ఎలవెన్సులూ అందకపోతే కొన్ని, జబ్బుచేసికొన్ని, జావలేక కొన్ని, అనుభవంలేక కొన్ని, తెలియకకొన్ని, తెలిసి ఉండే ఒళ్లు మండుకొచ్చి కొన్ని, పక్కవాణ్ణి చదివేవాణ్ణి ఏడిపించడానికి కొన్ని, సరదాకికొన్ని తప్పులు చేస్తూఉంటారు. ఒకప్పుడు నవ్విస్తాయవి. ఒకప్పుడు చిరాకెత్తిస్తాయి, ఇంకొకప్పుడు కొంపలు ముంచుతాయి!"

"అందుకేనోయ్ నేననేది — తెలుగు దేశంలో చక్కగా ప్రింటుచేసే ప్రెస్సు ఒక్కటీ లేదని! ఇదే ఫారెన్‌లో చూడు! అఫ్‌సెట్లు, లైనోటైపు, మోనోటైపు—ఎన్ని ఉన్నాయని!"

"మనకీ ఉన్నాయనుకోండి కొన్ని! పనే సరిగా సాగటంలేదండి!"

"అయితే లోపమెక్కడుందంటావు?"


"అదే తెలియడంలేదండి!"

"ఆలోచించాలయ్యా! నెల్సన్ బ్రూక్స్ ఏమన్నాడు? 'థింక్ అండ్ గ్రో రిచ్' అన్నాడు! వీటి గురించి ఒక పరిశీలన ఒక పరిశోధన, ఒక శాస్త్ర రచన—ఇవన్నీ జరిగిందేది?" అంటూ నిమ్మరసం గ్లాసు సగం ఖాళీచేశాడు కొండ్రావుగారు. "ఇవన్నీ మీ బోటివాళ్లు చెయ్యాలి!"

"మా కెక్కడ చేతనవుతాయండి?" అన్నాడు కార్తవీర్యుడు.

"ఆ మాటంటేనే నాకుకోపం! నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ అండర్ ద సన్! ఆఫ్టాల్, పుస్తకం రాయడమంటేఎంత? అచ్చువేసేవాడూ అమ్మిపెట్టేవాడూ ఉండాలి గాని!"

"అదేనండి సమస్య! చిన్నప్పుడు ఉండబట్టలేక నేనూ కొన్ని కాయితాలు నలుపుచేసినవాణ్ణేనండి! 'ప్రాచీనావీతి' అన్న కథల సంపుటి వేద్దామనుకున్నా.



కానీ చేతి చమురు భాగోతానికి భయపడి మానుకున్నాను!"

"ఆ మాట చెప్పవేం? భేషూ! డోన్ట్ వర్రీ అబౌట్ ఇట్స్ పబ్లికేషన్; డూ యువర్ డ్యూటీ ఫస్ట్!"

కాండాత్కాండాత్ ప్రరోహంతి.....' అన్నాడు ఉపనిషత్కారుడు. అంటే ఏమిటి? నువ్వో పుస్తకం రాయి. గ్రాంటుకు అప్లయిచెయ్యి. పుస్తకం వెయ్యి. దాన్ని అమ్మేసి డబ్బు పక్కన పెట్టు. ఈసారి రెండు రాయి. మళ్లీ గ్రాంటుకు అప్లయి చెయ్యడానికి సమోషీపడకు. కొండంత పైరవీలోంచి ఎలకంత గ్రాంటయినా రాకపోదు. ఈ డబ్బూ ఆ డబ్బూ కలుపు. రెండు పుస్తకాలూ వేసెయ్యి. వాటిమీద వచ్చిందాంతో ఈసారి నాలుగు పుస్తకాలువెయ్యి. ఆయొక్క ప్రకారంగా నాలుగుపదహారూ చొప్పున పరంపరాభివృద్ధిగా పబ్లిష్‌చెయ్యమన్నాడు! ఇంకే మన్నాడు – 'ప్రజాతంతుంమావ్యవచ్ఛేత్సీః!' అన్నాడు. కొంపతీసి రెండూ లేక మూడుతో బుక్ ప్రొడక్షన్ స్టాప్ చేసేవుసుమా! అని వార్నింగిచ్చాడు అంచేత ఏమన్నమాటా? రాయి. రాయి. రాయి!"

"పొద్దుట్నించీ ప్రూఫుల్లోపడి కొట్టుకునేవాడికి–ఆలోచనకి రాతకి స్ఫూర్తి ఎక్కడుంటుంది సార్?"

అలాగనకు! స్ఫూర్తింకాదు; యు మస్ట్ హావ్ ఎట్ ఇన్నర్ అర్జ్! నీచుట్టు పక్కల చూడు; ఎత్తూ పల్లంచూడు; వెలుగూ నీడా చూడు; మనస్సులో మధించు! కాయితంమీద పెట్టు! మాట వరసకి నీ ప్రెస్సనుభవమే తీసుకో!"

"ఔననుకోండి!" అంటూ నీళ్ళు నమిలాడతను.

"చాలు! ఇరవై నాలుగ్గంటలు టైమిస్తున్నాను. రాసి రేపు పట్రా! ఐ మస్ట్ సీ యూ టుమారో యాజే రైటర్!" అంటూ ఖరాఖండీగా చెప్పాడాయన.

"నన్ను మొహమాటపెట్టేస్తున్నారు!"

"కావలిస్తే బలవంతం చేస్తాను. తెలిసిందా!" అంటూ ఓ నవ్వు నవ్వాడాయన. "ఇంతకీ, మన ప్రూఫ్ ఎంత వరకూ వచ్చింది?"

"గౌరీ బఫెలోస్ దాకానండి!"

"వెరీగుడ్! తరవాత చదువు!" అంటూ కళ్ళజోడు సరయిన పొజిషన్‌లోకి మార్చుకున్నాడు.

మర్నాడు పొద్దున కార్తవీర్యుడు వెళ్లేసరికి కొండ్రావుగారు జలకాలాడుతున్నాడు. నూకరాజే అతన్ని రిసీవ్ చేసుకున్నాడు.

"అగ్గిపెట్టె ఉంటే అందుకోవోయ్! నూకరాజూ" అంటూ చెయ్యిచాపి, దానికి బదులుగా నూకరాజుకో సిగరెట్టిచ్చాడు కార్తవీర్యుడు.

"బాబూ! తమరూ లింగయ్యగారి అచ్చాపీసులోనే కిదంటండీ పనిచేస్తున్నారు?" అంటూ అడిగాడు నూకరాజు అగ్గిపెట్టె తింగి తీసుకుంటూ.

"ఔనోయ్!"

"ఆయ్! మా అయ్యగారి మాటంటే అరికి మా సెద్ద గురండి"

"అందుకేగా ఇక్కడికి వచ్చింది!"

"అంతగురి ఎందుకనుకున్నారేటి?"

"ఏమో!"

"అయబాబు! తమరికింకా తెల్దేటండి?"

"తెలీదోయ్! నేనిక్కడచేరి ఎంతో కాలం కాలేదు!"

"అల్లా సొప్పండి! అసలండీ– మీ లింగయగారు రొండుపూట్లా మా అయగారికాడికొచ్చి అన్నీ అడుగుతూండేవోరండి! అంతెందుకండి? అసలా అచ్చాపీసుకి పేరెవరెట్టే రనుకుంటున్నారు?"

"ఏవీఁ అనుకోలేదోయ్!

"మా అయ్యగారే కదటండీ!"

"నిజమే?"

"సత్తెప్పెమానికంగా నండి! అసలో పాలేవ(యిందంటే— మా సిన్నయగారున్నారు సూడండి!"

"నే నెప్పుడూ చూళ్ళేదే!"

"ఇప్పు డిక్కడలేర్లెండి! ఎనక, ఇక్కడే కాలేజీలో సదువుతా వుండేవోరు. ఇప్పుడు, మన ఎమ్మెల్లే ఎలచ్చన్లూ అయీ జరుగుతా ఉంటాయి సూడండి—ఆల్లాంటియి కాలేజీకుర్రోళ్ళక్కూడా జరుగుతూంటాయండి."

"ఔను."

"మా సిన్నయగారు అల్లాటి కాలేజీ ఎలచ్చన్లో నించున్నారండి. ఎలచ్చన్లంటే మాట్లాండి? శానా కరుసవుద్ది! ఆ డబ్బు మల్లా ఒత్తాదా, సత్తావా!"

"కదుమరీ!"

"మీ వోటు నాకే ఎయ్యండోయ్— అంటా, సినేవా(కొయితాల్లాంటియి అచ్చేసి తలకోటిపంచిపెడతారు సూడండి —అల్లాయి మా సుందరంబాబుగారు కూడా ఏయించేరండి! ఎన్ననుకున్నారేటీ? బండిడూ!"

"ఇంతకీ ఎలక్షన్లో నెగ్గేడా?"

"అయబాబు! అందాకా అయితే ఇంకేవ(న్నా ఉందాండి? ఎలచ్చను కాకుండానే మాంగారు మూర్త వెట్టించేసేసేరండి!"

"ఎలక్షనయేలోగా పెళ్ళికి తొందరేమొచ్చింది?"

"మా మంచోరే! తొందరేటంటారేటీ?— ఓ మూల కొంపలు మునిగిపోతంటేను!"

"ఏమయిందోయ్?"

"పొలాలు ఇన్నేసి ఎకరాలకంట ఎక్కువుండకోడదని ఆ దాచ్చారం బీవ(న్న నెత్తిక్కొట్టినట్టు – గవుర్నమెంటు సీలలు కొడతాదంట—తవ(రికి తెల్దాండి?"

"తెలుసు. నా చిన్నప్పట్నించీ అంటున్నదే ఆ మాట!

"మరింకేండి! ఆరి మాంగారికి శానా బూవు(న్నాదిలెండి. అమ్మాయిగారి పెళ్ళిచేసేసి ఇడగొట్టాపోతే, ఆరివోటా గవుర్నమెంటు పట్టుకుపోద్దంటండి!

"అవి సరే! దీని సంగతి వీళ్ళకి బాగా ముందే ఎలా తెలిసింది?"

"అదేటండోయ్! పెద్దోరికియన్నీ ముందత్తిగానే తెలిసిపోవంటండే? దీవ(వుండగానే ఇల్లు సక్కబెట్టేసుకోద్దూ?" అందుకని, ఎలచ్చను కావాలో బూవే(కావాలో సూసుకోమన్నారండి! అప్పుడు మాసుందరంబాబు ఏ ఎగనున్నాడోకాని బూవే(కావాలని బుల్లెమ్మగార్ని తెచ్చుకుని కాపరవె(ట్టేసరండి!"

"తెలివైన వాడే!" అంటూ కార్తవీర్యుడన్నమాటలు కొండ(రావుగారి చెవిని పడ్డాయి. "ఎవరయ్యావాడూ?"



అంటూ ఎదురుగా ఉన్న కవాచీబల్లమీద నడుం వాల్చాడాయన.

"మీ అబ్బాయిగారేనండి!"

"ఆ(! వాడిమొహం! ఆ ఎలక్షన్లలో పడి డబ్బు తగలేస్తూ ఉంటే నేనే వాళ్ళ మావ(కి రాసి ముహూర్తం పెట్టించమన్నాను" అందూ ప్రూఫ్ అందుకోబోయాడు.

"సార్! మా ప్రెస్సుకి పేరు పెట్టింది మీరేటకదండీ?" అని అడిగాడు కార్తవీర్యుడు.

"ఆ(, ఏదోలే!" అంటూ తేల్చిపారేశాడాయన.

"నేను అదే అనుకున్నానండి!"

"అసలేమయిందంటే ఓ రోజు రాత్రి మీ సేటు వచ్చి పేరోపేరో అంటూ నా దగ్గర ఒకటే ఇదయాడు. ప్రాణం తీశాడంటే నమ్మ. ఇదుగో, అప్పుడు ఈ హాల్లోనే కూర్చున్నాం. ఈ పక్క గది ఉందే! ఇందులో మా సుందరం ట్రాన్సిస్టరుపెట్టి పాటలు వింటున్నాడు. అదేదో పాటయ్యా! ఏమిటది? ఆ(— లేలేలే నా రాజా!" అని కాబోలు వినిపించింది. పెద్దమనుషులతో మాట్లాడుతూండగా ఈ పోకిరీ పాటలేమిటనిపించి ఒళ్ళు మండింది నాకు!—ఎవత్తిరా, ఆ పాడేది!' అంటూ కేకేశాను. "జ్యోతిలక్ష్మి నాన్నా!" అన్నాడు వాడు. ఏడిశావుగాని దానోరు నొక్కుతావా, నన్ను రమ్మన్నావా?— అని గదిమాను. దాంతో వాడు డాబామీదికి పరుగెత్తేశాడు. జ్యోతిలక్ష్మట! జ్యోతిలక్ష్మి!—అంటూ పళ్ళు కొరుక్కున్నాను. ఇవుగో ఈ నాలుగక్షరాలూ మీ సేటుచెవిని ఎప్పుడు పడ్డాయో తెలియదోయ్! "మా ప్రెస్సుకా పేరే పెడతాను, మీరు ఊ( అంటేకాని వీల్లేదని పట్టుపట్టాడు. నాదేంపోయింది? "సరే అలాగే పెట్టుకో'—అన్నాను."

"మంచిపని చేశారు! ఆ పేరే లేకపోతే మా ప్రెస్సుకు ఇంత బిజినెస్ జరిగేది కాదు!" అన్నాడు కార్తవీర్యుడు.

"ఔనట! అ పేరు పెట్టాక, మా వాడే దానికి బోణీ కస్టమరు! ఎలక్షను ప్రచారానికి అక్కడే హాండ్‌బిల్సు వేయించి ప్రెస్సు పేరు పక్కన '—అభినందనలతో' అని వేయించాడు. దాంతో మీ సేటు ఫైలందుకుంది. అన్ని కాలేజీల కుర్రాళ్ళూ అక్కడికే ఎగబడ్డారు. అందుకని మా వాడిదగ్గిర మీ సేటు డబ్బు తీసుకోలేదనుకో! అయినా ఆ ఎగలో వాడికాపెళ్ళి జరక్కపోతే చదువు కాస్తా గుంటపెట్టి గంట వాయించేవాడు!" అన్నాడు కొండ(రావుగారు.

"కరెక్టుగా చెప్పారు! ఈ కాలేజి

రాజకీయాల్లో చదువులే కాదు, ప్రాణాలు కూడా పోతున్నాయి!" అన్నాడతను.

"అన్నట్టు, నేను నిన్న చెప్పింది రాసుకొచ్చావా?"

"రాశానండి!"

"చదువు చూద్దాం!"

"ఓ చిన్న కథండి—అనగనగా సైపులో"

"ఇంతాచేసి నువ్వు రాసింది కథా? 'తిలాన్ వికీర్య, ఉదకమా పూర్య' లాంటి దేమిటి? పోనీ ఈ వేళకి చదువు!"

"అనగనగా ఒక సబ్జెక్టు. ఆ సబ్జెక్టుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ ప్రెస్సుకెళ్ళి ఏడుప్రూఫులు తెచ్చారు. ఆ ఏడింటినీ చదవేస్తే, వాటిలో ఒకటి చదవబడలేదు.

'ప్రూఫూ! ప్రూఫూ! చదవేస్తే ఎందుకు పడలేదే?' అంటే—

'చదివేవాడికి ఉన్నమతిపోయింది' అంది.

"చదివేవాడా! చదివేవాడా! నీకు మతే అంటే ఎందుకుపోయిందిరా?" అంటే—

తెలుక్కేదో తెగులు పట్టుకుంది!' అన్నాడు.

'తెలుగూ, తెలుగూ! నీకేం తెగులే?' అంటే—

'పోయి నాసబ్జెక్టు నడుగు' అంది.

'సబ్జెక్టూ, సబ్జెక్టూ! ఇదేం సరసవే?' అంటే—

పోయి అధర్ని అడుగు!' అంది.

'ఆధరూ, ఆధరూ!' ఇదేమిటయ్యా?' అంటే—

'ఎడిటరంటూ ఒకడుండగా, నన్నడుగుతావే?' అంటూ కోప్పడ్డాడు.

'ఎడిటరుగారూ, ఎడిటరుగారూ! శ్రీమతి చిత్తశుద్ధి మిమ్మల్నిలా ఒగ్గేసెయడం ఏంబావుందంటారు?' అంటే—

"హా తెరీ! హ్వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్? అంటూ తెయ్యమని లేచి 'యూ హౌ మచ్, యువర్ మనీ హౌమచ్!' అంటూకదాకళి చెయ్యబోయి మళ్లీ నిలదొక్కుకుని, 'గో అండాస్క్ యువర్ బ్లెసెడ్ తెల్గూ మీడియం' అన్నాడు, ఇంతసేపూ సిట్టింగుచేసి నందుకూ టాకింగ్ చేసినందుకూ ఒకే బిల్లు ప్రొడ్యూస్ చేస్తూ—మళ్లీ, రశీదు కావలసిన వాడికి ఇంకో పదిపైసల స్టాంపు దండగకాకుండా!

"తెల్గూ మీడియమూ! తెల్గూ మీడియమూ! ఎందుకేడుస్తున్నావమ్మా?' అంటే—

'ఇంగ్లీషు మీడియం కుట్టింది!! అంది ఎగచీల్చుకుంటూ.

'ఇంగ్లీషు మీడియమూ, ఇంగ్లీషు మీడియమూ! నీకిదేం పోయేకాలమే? మా చిట్టితల్లిని ఎందుక్కుట్టావు?' అంటే —

'నా బంగారు కన్నంలో వేలుపెడితే కుట్టనా?' అంది.






"కథ కంచికీ మనం ప్రెస్సుకీను!" అంటూ తలపైకెత్తాడు కార్తవీర్యుడు

కొడదప్రావుగారు, అంబాజీపేట సరుకు అంగుట్లో ఇరుకున్నట్టు మొహం పెట్టాడు అయినా, "పేరేం పెట్టావు?" అన్నాడు.

"చీమకుట్టిన తెలుగండి"

"ఫరవాలేదనుకో! అయినా, ప్రూఫులాంటి ఉదాత్తమైన విషయాల గురించి కథలూ పద్యాలూనా రాయడం? రాస్తే శాస్త్రకట్టుగారాసి చూపించు! అదీ ప్రజ్ఞ! చిన్నతనంలో ఇల్లాంటివి నేనూ లక్ష గిలికాను".

"మరి చెప్పరేమండి? కవిత్వమా కథలా?"

"కాకమ్మ కథ లెవడిక్కావాలి? బందోబస్తు కవిత్వమే రాసాను. మీరు వచనపదాలంటారేం, అవి గంటకి వెయ్యిలైన్లు ఆశువుగా చెబుతాను."

"బలహారం చేస్తుంది, వెయ్యొద్దు గానండి, పది పదిహేనులైన్లు విని పించండి సార్!" అంటూ కార్తవీర్యుడు ప్రాధేయపడ్డాడు.

"సరే, నీముచ్చటెందుకు కాదనాలి! విను—

ఈ ప్రపంచమొక గాలిప్రూఫు
మనమంతా అచ్చక్షరాలం!
బోర్డుపైపులు కొందరు
వాలుడు పైపు ఇంకొందరు,

స్వతంలేనివాళ్ళు హాఫ్‌బాడీలు, అవీ
కానివాళ్ళు స్పేసింగ్‌లెడ్లు!
మన బతుకుల పరిధులు,
ఇరికిరుకు గదులు
అవి లేకపోతే అసలు కేసులేలేవు!
మన్ని హాండిల్ చేసే చెయ్యి ఎక్కడా
కనిపించదు
మనం చేసే ప్రొటెస్టు ఎవడికీ
వినిపించదు
కంపోజింగూ డిస్పోజింగూ ఇటిట్టె
చేసేస్తాడు!
కూర్పులో ఎన్నితప్పులున్నా తన
ప్రూఫు తాను చదవడు.
అందుకే మరిచేప్పేది, బంతిబంతిలో
టర్న్డప్పులు
మాటమాటకీ రాంగ్‌ఫాంట్లు
కూడనిచోట్ల స్పేసింగులు
ఉన్నచోట్ల జామింగులు
ఏనాడో అడిగిన వాంటింగులు
తరుణం మించినగాని తగలపడవు!
ఈ గాలీకి తుదీ మొదలూ తెలీదు
సరిచూడ్డానికి ఒరిజినల్సే లేవు!
ఇప్పుడీ గాలీ చదవేదెలా?
చదవక మానేదెలా? మనం
మనేదెలా?—

ఎలా ఉంది?" అన్నాడు కొండల్రావు గారు.

"చాలా రియలిస్టిక్‌గా ఉంది సార్! దీన్ని తప్పకుండా పబ్లిష్‌చెయ్యాలి. మీరు కళ్ళుమూసుకుని చెప్పేస్తూ ఉండండి నేను రాసి పెట్టేస్తాను!" అన్నాడు కార్తవీర్యుడు, జేబులోంచి కలం తియ్యబోయి.

"మేనత్తకొడుకో మొగుడూనూ, ఈ పొడిముక్కలోకవిత్వమూనూ! చాల్చాల్లె అసలు కవిత్వమంటే ఏమిటి? తరవాత తీరిగ్గా చెబుతాను. కాని దేశం బాగు పడ్డానికి కావలసినవి కథలూ కవిత్వాలూ కావయ్యా! శాస్త్రం కావాలి, శాస్త్రం!"

"అల్లాగయితే ముందు, ఓనమాలూ గట్రా నేర్చుకోవాలండి!"

"అబ్బెబ్బే! దీనికి వేరే ఓనమాలు లేవు. కావలసినవల్లా — వాస్తవాన్ని గ్రహించే చూపూ దాన్ని వివేచించే బుద్ధీ! ఫరెగ్జాంపుల్ — ప్రూఫేతీసుకో! ప్రూఫనగా నేమి? అదెన్ని విధములు? దాన్ని దిద్దు సాధనము లెవ్వి? వానిలో రకములెవ్వి? దిద్దుటలో వచ్చు ఇబ్బంది లెవ్వి? నివారణోపాయములెవ్వి?—వగయిరాలతో ఒక శాస్త్రం తయారు కాదంటావా?" అంటూ సూటిగా చూశాడు కొండల్రావుగారు.

కార్తవీర్యుడికి చెమటలు పట్టాయి. మాటరాక, ఒక టెన్‌పాయింట్ నవ్వుతో సరిపెట్టాడు

"శాస్త్రమంటే నవ్వులాటకాదోయ్! సైన్స్! ఎ సిస్టమెటైజ్డ్ బాడీ ఆఫ్ నాలెజ్! రాసుకో చెబుతాను!" అంటూ కాయితం, కలం ఇచ్చి తరిమాడు. కార్తవీర్యుడు తల ఒగ్గాడు.



"ప్రూఫ్‌శాస్త్రం అని హెడ్డింగుపెట్టు ముందు!—అన్నట్టు ప్రూఫ్‌కి తెలుగేమిటి?" అని అడిగాడు కొండల్రావుగారు.

"తెలీదండి. చిత్తు అంటామంటారా?"

"అబ్బే! చిత్తూ నత్తూ అంటే శాస్త్రంలో టెక్నికాలిటీ దెబ్బతినేస్తుంది. గవర్నమెంటాఫిండియా వాడు ఏమన్నాడు చెప్మా! 'రద్' అనో 'పురుప్' అనో అని ఉంటాడు. మనం ప్రూఫనే అందాం లెద్దూ!"

"సరే నండి"

"అన్నట్టు, ప్రూఫ్‌శాస్త్రమని హెడ్డింగు పెట్టావుచూడు! అక్కడ ఇంగ్లీషులో 'ప్రూఫిస్టికిక్స్' అనికూడా బ్రాకెట్లలో రాయి. ఏం?"

"రాశాను."

"ప్రూపుల్లో రకాలెన్ని?"

"గాలీ దగ్గిరినుంచి ఎన్నయినా ఉండచ్చండి—ఫస్టు, సెకండు థర్డు—ఇలా! ఒక్కొక్క ఫారానికి ఏడేసి ఎనిమిదేసీ ప్రూపులా కరెక్షన్లు కారీఔట్ చెయ్యకుండా ఇచ్చేవాళ్ళు కరెక్ట్‌చెయ్యకుండా అడిగేవాళ్ళూకూడా రండి."

"అన్నయితే మనకి దొరకవు, మూడింటితో సరిపెడదాం. ప్రూఫ్ నియంత్రణ చాలా అవసరం ఏమంటావు?"

"మీ ఇష్టమండి!"

"గాలీ ప్రూపుని గల్లీ ప్రూఫందాం! సందులా పొడుగ్గా ఉంటుంది కదూ? దానికీ మరోపేరు 'రణచిత్తు' అని కూడా పెట్టు."

"అయితే — తక్కిన రెండింటికీ 'చిత్తు', 'ఫెయిర్' అని పెడదామండి!"

"సరే, అలాగే కానియ్యి! ప్రూఫ్ దిద్దేవాణ్ణి 'ప్రూపరి' అంటే గ్రామ రొప్పుకుంటుందా? పోనీ ప్రూఫ్ చదువరి లేదా పాఠకుడు అనిపెట్టు, అయిదా! ప్రూఫ్‌శాస్త్ర సంప్రదాయాలు—అని ఒక సెంటర్ హెడ్డింగుపెట్టు. బ్రాకెట్లలో స్కూల్స్ ఆఫ్ ప్రూఫిస్టిక్స్ అని రాయి. ఇప్పుడు కొన్నిసంప్రదాయాలు చెప్పు—చెప్తాను!"

"అక్షర మక్షరం జాగర్తగా చదవడ మొకటండి!"

"గుడ్! నిర్మాణాత్మకప్రూఫ్ వాద మని ఒక సైడ్‌హెడ్డింగు పెట్టు, బ్రాకెట్లలో 'స్ట్రక్చరల్ ప్రూఫిజం' అని రాయి తరవాత?"

"వాక్యం తిన్నగా ఉంటే చాలనట్టు దిద్దడమొకటండి!"

"దీన్ని ప్రకార్య ప్రూఫ్ వాద మందాం. అంటే, ఫంక్షనల్ ప్రూఫిజం!"

"పేజీ మట్టుకు ఒకసారి అలా అలా చూసి తిప్పెయ్యడం కూడా ఉందండి!"

"లేకేం? బ్రౌజింగు అన్నమాట. దీన్ని గెస్టాల్ట్ ప్రూఫ్‌వాదమందాం."

"ఒక లైను చదవడం — తరవాత మరికొన్ని లైన్లు ఎలాగా దానికి సంబం

ధించినవే ఉంటాయికదాని వాటిని వదిలేసి తరవాత చదవడం ఉందండి."

"వెరీగుడ్! ఎసోసియేషనిస్టిక్ ప్రూఫిజం అన్నమాట. దీన్ని 'సంబంధాత్మక ప్రూఫ్‌వాదం' అందాం ఏమంటావు?"

"అల్లాగే అందామండి!"

"ఇంకేమిటి?"

"ఇంకొక్కటి కనిపిస్తోందండి. ప్రూఫ్‌నే ప్రేయసిగానో ప్రియుడిగానో ఊహించుకుని మురిసిపోతూ చదవడమండి!"

"ఇంకేం? ప్రూఫ్‌శాస్త్రం మరీ డ్రై సబ్జక్టు కాదన్నమాట! దీన్ని ప్రూఫ్ కామవాదమందాం. బ్రాకెట్లలో 'లిబిడినల్ ప్రూఫిజం' అని రాయి. అయిందా! ఇంక ప్రూఫ్‌దిద్దేవాళ్ళకి వచ్చే జబ్బులు కొన్నిచెప్పు చూద్దాం!"

"చాలాఉన్నాయండి. ఒంటివీ మనస్సువీను!"

"చూశావా! నువ్వూ లైన్లో పడిపోయావు! ఇంకో సెంటరు హెడ్డింగు పెట్టు— ప్రూఫ్ జబ్బులు — బ్రాకెట్లలో ప్రూఫోసెస్."

"ప్రూఫ్ జబ్బులంటే ప్రూఫ్‌లకివచ్చే జబ్బులని అర్థం వస్తుందేమోనండి!"

"పరవాలేదు లేవోయ్! అంతగా ఎవరన్నా విమర్శిస్తే, ప్రూఫూ-ప్రూఫ్ రీడరూ ఇన్‌డివిజిబుల్ అని చెబుదాం!"

"ఈ జబ్బులు రెండు రకాలండి!— శారీరక జబ్బులూ మానసిక జబ్బులూ!"

"ఇహనేం? రాసెయ్యి. ప్రూఫ్ శారీరక జబ్బుల్ని ప్రూఫోసొమాటిక్స్ అందాం, అందులో రకాలు రాయి."

"కళ్ళ జబ్బులు, కాళ్ళ జబ్బులు, కీళ్ళ జబ్బులు, కర్ణ జబ్బులు, కర జబ్బులు, కశేరుజబ్బులు, కంధర జబ్బులు, నర జబ్బులు—అంటే నరాల జబ్బులండి."

"బాగుంది. తరవాత మానసిక జబ్బులు రాయి. ప్రూఫ్ ఎలర్జీని ఏమందాం?" "ప్రూఫ్ వెలపరమందామండి. ఇంకోటి — ప్రూఫంటే బెదిరిపోతూండడమండి. ప్రూఫ్ భీతి అనొచ్చు కదా!"

"నిక్షేపంలా! ఇంగ్లీషు పేరుకూడా రాయి. లేకపోతే తెలుగువాళ్ళకి తెలీదు. ప్రూఫోఫోబియా!"

"తరవాతది: ప్రూఫోన్మాదం అంటే ప్రూఫోమానియా అన్నమాట."


"రాసెయ్!"

"ఆ ఉన్మాదంలో డీలా పడిపోవడం లాంటి జబ్బుకూడా వస్తూంటుందండి!"

"మానిక్-డిప్రెసివ్ ప్రూఫోసిస్— అంటే, ఉన్మాద—అవసాద ప్రూఫోసిస్! రాసుకో!"

"అయ్యో! ప్రూఫులో 'కొరకు' అన్న వస్తే 'కో మాటస'మని, కోసమని వచ్చినచోట తప్పనుకుని కొరకని మార్చడం లాంటిది కూడా ఓ జబ్బేనండి."





"అయితే దీన్ని ప్రూఫోనియా అందాం. దీన్ని తెనిగించకు."

"అడ్డ దిడ్డంగా ప్రూఫులు దిద్దడ మింకోటండి!"

"ఇది ప్రూఫాక్సియా!"

"ప్రూఫ్ చదవడానికి శక్తిలేకపోవడం ఒకటండి."

"దీన్ని ప్రూఫోలెక్సియా అను."

"ప్రూఫ్ మూర్ఛకూడా ఉందండి."

"ప్రూఫిప్సియా అన్నమాట"

"తప్పులన్నీ సరిగానే దిద్దాననుకుని అందులో తప్పులున్నా సరే—అనుభూతి పొందడాన్ని ఏమంటే బాగుంటుంది?"

"దీనిపేరు ప్రూఫోరియా."

"గాలీలోనే స్టయికార్డరివ్వడం ఒక జబ్బు లక్షణమండి!"

"దీన్ని ప్రూఫస్ప్రైకో అందాం, ప్రైకో స్పెల్లింగు సరిగా రాయి— *Praecox*."

"దిద్దిన ప్రూఫే మళ్ళీ దిద్దడం—అంటే దిద్దకుండా ఉండలేకపోవడం—ఇంకోటండి"

"అబ్సెసివ్-కంపల్సివ్ ప్రూఫోసిస్. తెలుగులో ఏమందాం?"

"అవరోధ—నిర్బంధ ప్రూఫ్‌జబ్బు!"

"గుడ్! నువ్వయ్యా టెర్మినాలజిస్టువంటే!"

"టైముకు ప్రూఫ్ రాలేదని విరహబాధ పడ్డం ఒకటి ఉందండి!"

ప్రూఫ్ విరహమా? అయితే ప్రూఫిస్టీరియా అను."

ప్రూఫు మూలంగా రెండు రకాల అవస్థలకు గురికావడం కూడా ఉందండి. మొదటి అవస్థ ఏమిటంటే—ప్రూఫ్‌లంటే, పెడమొహం పెట్టడం వాటి వేపు వెర్రి చూపులు చూడ్డం. రెండో అవస్థ ఏమిటంటే—ప్రూఫుల్ని చీల్చి చెండాడ్డమండి. అంటే, అచ్చు తప్పులు కనబడకుండా కరెక్ట్ చేసి పారెయ్యడమండి."

"అయితే దీన్ని ప్రూఫో ఫోబియా అందాం."

"అవస్థాద్వయ ప్రూఫ్ ప్రమేయం అనమంటారా?"

"మహారాజులా."

"ఇంకోటుందండి! ప్రూఫులు దిద్దడంలో తనంత గొప్పవాడు లేడని విర్రవీగడమండి. అంటే, ప్రూఫహం భావమన్నమాటండి."

"దీన్ని నార్సిసిస్టిక్ ప్రూఫిజం అను. ఇంతేనా, ఇంకా ఉన్నాయా?"

"ఇంతేనండి."

"నేనింకోటి చెబుతా రాసుకో! రాసిన ఒరిజినల్‌తో పోలిక లేకుండా టెక్స్టు దిద్ది పారెయ్యడం, అంటే—మహాప్రభో, ఈ అచ్చయిన పుస్తకం నేను రాసింది కాదూ అంటూ అక్షరుడు మొరపెట్టుకునేటట్టు చెయ్యడం! దీనికో మంచి టెక్నికల్ టెరం తరవాత ఆలోచించు. ఇకపోతే, ఈ శాస్త్ర మెల్లాగా కాలేజి కోర్సుల్లోకి వస్తుంది కాబట్టి ఉద్యోగాలు కావలసిన వాళ్ళకి కొన్ని డిజిగ్నేషన్‌లు, అర్హతలు ఏర్పాటు చెయ్యాలి మనం. ఉదాహరణకి ప్రూఫాలజిస్టుని ప్రూఫ్ శాస్త్రి అనో ప్రూఫ్ సిద్ధాంతి అనో అనవచ్చు. దీనికి అర్హతలేమిటంటే, ఇంగ్లీషు ప్రూఫ్ శాస్త్రంలో ఎమ్మే డిగ్రీ ఉండాలి. అదే తెలుగులో అయితే పిహెచ్ డి. కి తక్కువ ఉండడానికి వీల్లేదు. లేకపోతే కొంప మునిగిపోతుంది! ఏం! ప్రూఫిస్టుని ప్రూఫ్ నిపుణుడనవచ్చు. అంటే ప్రూఫ్ శాస్త్రంలో డిప్లమా ఉండాలన్నమాట. ప్రూఫియాట్రిస్టుకి కూడా ఓ పేరు పెడదాం—ప్రూఫ్ జబ్బు శాస్త్రి అని. ఇతనికి ప్రూఫిస్టిక్సులో ఎమ్మే ఉండాలి ప్రూఫోసిస్‌లో ఎం. డి. ఉండాలి

"అయితే పెద్ద డిగ్రీలు ఉండడమే కాని అనుభవ మక్కర్లేదంటారా?"

"సరే, నువ్వింతగా ఇదవుతున్నావు కనక—అనుభవమున్న వాళ్ళకి కూడా ఓ ఛాన్సు ఇద్దాం. బి. ఏ. ప్యాసయి, ముప్పయి ఏళ్ళ ప్రూఫ్ పఠనానుభవం ఉండాలని రాయి. అతన్ని ప్రూఫ్ దీక్షిత్ అనొచ్చు.


"ప్రూఫు రోగ చికిత్స కూడా రాయమంటారా?"

"అవి లేకపోతే ఎలాగోయ్? ప్రూఫు డయాగ్నసిస్. ప్రూఫో తెరాప్యుటిక్స్!"

"రాశానండి"







ప్రూఫ్ రీడర్లకి ఇన్సెంటివ్స్ కొన్ని ఇవ్వాలి. కొన్ని టోర్నమెంట్లూ పరీక్షలూ జరగాలి. ప్రూఫ్ సహన పరీక్ష, ప్రూఫు బల పరీక్ష ప్రూఫు వేగ పరీక్ష ప్రత్యేకంగా జరగాలని రాయి. వాటితో బాటు కొన్ని బహుమతులు కూడా ఇప్పిద్దాం."

"అల్లాగేనండి."

"బహుమతు లేమిటను! గాలీ గోల్డ్ కప్పు, గూటెన్‌బర్గ్ అంతర్జాతీయ డొల్లుడు ట్రాఫీ—ఇల్లాటివి! కొన్ని పతకాలూ బిరుదులూ కూడా రాసుకో! పరమ ప్రూఫ్‌చక్ర—ఇది ప్రూఫ్ దిద్దుతూ కన్నుమూసినవాడికే ఇవ్వాలి. ఇక పోతే విశిష్టప్రూఫ్‌చక్ర, ప్రూఫ్ వీరచక్ర—ఇల్లాటివి. ఇంక బిరుదులు—ట్రెడిషనల్లే అనుకో! సహస్ర ప్రూఫుచ్ఛేద అపూర్వ చింతామణి, ప్రూఫ్ రత్న. ప్రూఫ్ విభూషణ. ప్రూఫుశ్రీ. ప్రూఫ్‌సామ్రాట్, మూరుప్రూఫులగండ—ఎట్సెట్రా!"

ఇవి సరేననుకొండి! ఇవన్నీ కలగా పులగంచేస్తే పంచకోలకషాయం అవుతుంది కాని శాస్త్రమవుతుందంటారా?"

"కాదనే వాడెవడు? రమ్మను! హెడ్డింగులు పెడతాం; నిర్వచనాలిస్తాం; సూత్రాలిస్తాం; బొమ్మలు వేస్తాం; పేరా పేరాకీ డెసిమల్ పద్ధతిలో అంకెలు వేస్తాం; ఒక ఎత్తుగడ, ఒక నడక, ఒక వివరణ, ఒక వాదానికింకో ప్రతివాదం; సారాంశం; ఉపసంహారం; బిబ్లియాగ్రఫీ; టెర్మినాలజీ, గ్లాసరీ; తప్పొప్పుల పట్టిక—ఇవన్నీ ఇచ్చాక శాస్త్రం కాక ఛస్తుందా? కనక, నేను చెప్పినట్టురాసి రెండురోజుల్లో పట్రా!"

"చూస్తానండి!"

"చూడ్డం కాదు, చెయ్యాలోయ్!"

"అల్లాగేండి! ఈ వేళ పదో ఫారానికి స్ట్రయికార్డరు తెమ్మన్నాడండి మా సేటు!"

"ఇదుగో ఇప్పుడే ఇస్తాను," అంటూ కొండల్రావుగారు మళ్లీ ప్రూపుల్లో పడ్డాడు.

ఒక చేత ప్రూపులకట్టా, మరోకచేత సిగరెట్టుముక్కా పట్టిన కార్తవీర్యుడు గేటుదాటి రోడ్డుపట్టి మెల్లగా నడుస్తున్నాడు నెలకోఫారం చొప్పున సాగే అచ్చు పనిలాగ! దుకాణాల సైన్‌బోర్డులూ సినిమాల పోస్టర్లూ చూపులతో ప్రూఫ్ దిద్దుతున్నాడు. ఒక బోర్డు మీద–'గవాలియర్‌ష్ట్రబుషర్‌టింగ్' (గ్వాలియర్ బుష్ షర్టింగని రాయడానికి పడ్డ పాట్లు); ఒక సినిమా పోస్టరుమీద–బ్రహ్మాండమైన ఉగాది విడుదల; 'నిన్నే ఒలిచితినోయీ!' తప్పక చూడండి! (అర్థం అస్పష్టంగా ఉంది–నిన్ననా, నిన్నే ననా? ఒకారమా?;) ఒక సిటీ బస్సుమీద–'ఎక్కువకాలం మన్ననగల బాటరీ ఎవ్వరెడీ! (మనిక అని అర్థం కాబోలు!); ఇంకోబోర్డుమీద–'ఇచ్చట తల, వెంట్రుకలు అందముగా నరక బడును' (నరకడం సరే, తల పక్కన కామా పెట్టిన భావిభారత పౌరుడు ఎవడో? ఇలా ఎన్నవి దిద్దుతాడు? ఎన్నిసార్లని దిద్దుతాడు? అందుకే కాబోలు, "అందుకే కాబోలు ప్రూఫ దేలయన్న దేశంబు ప్రూఫేను!" అన్నాడు మాధవుడు.

"అబ్బా! నీరసంగా ఉంది! జేబులో ఇంకో పది పైసలుంటే ఎంత బావుండును?" అనుకున్నాడు కార్తవీర్యుడు దాటిపోతున్న హోటలు వైపు చూస్తూ. "అయినా, మన కష్టార్జితం, పాపం, ప్రాప్తిలేదు వీడికి!" అనుకుంటూ ముందుకేసాగాడు.

ప్రెస్సులో అతను అడుగుపెట్టె సరికి మాధవురావు దుకాణం కట్టేసి ఇటూ అటూ పచార్లుచేస్తున్నాడు.

"రావయ్యా స్వామి! స్ట్రయికార్డరు కోసం మిషను విరహతాపంలో ఉంది," అంటూ అతన్ని తొందరచేసి, ప్రూఫును గదిలోకి పంపించి, మిత్రుణ్ణి జబ్బపట్టుకుని బయటికి లాక్కొచ్చాడు మాధవరావు.

"నన్ను మాన్‌హాండిల్ చేస్తే చేశావుగాని, అర్జంటుగా ఓ అరకప్పుడు టీ పోయించకపోతే, వచ్చే జన్మలో కూడా – ఇదే ప్రెస్సులో, ఇదేజీతంలో ప్రూఫ్‌రీడరువయి పుడతావు జాగర్త!" అంటూ హెచ్చరించాడు కార్తవీర్యుడు.

"ఆగర్ప ప్రూఫ్‌మంతుణ్ణి అవుతానంటావు. అంతేనా? మరీ మంచిది, నాకేమన్నా ప్రూఫ్‌ఎలర్జీ ఉందనుకున్నావా? ధర్మశాస్త్రం మనువు, వ్యాకరణంపాణిని, నాట్యశాస్త్రం భరతుడు, రిపబ్లిక్ ప్లేటో, అద్వైతం శంకరుడు, బ్రహ్మసమాజం రామ్మోహనరాయి, హితకారి వీరేశలింగం, వాడుకభాష రామూర్తి వగయిరాలంతా ఒక్కొక్క ఫీల్డులో పేరుమోసిన ప్రూఫ్‌రీడర్లు కారంటావా? అంతెందుకు? ఒక్క గంటసేపు దేశాన్ని నా చేతుల్లో పెట్టిచూడు! మొత్తం అవకతవకలన్నీ గాలీ దిద్దినట్టు దిద్దకపోతే ఒట్టు!"

"ఒట్టు మాట సరేగాని, ముందో సిగరెట్టు పారేసి ఇరానీ హోటల్‌కి దారితియ్యి!" అంటూ లాగాడు కార్తవీర్యుడు.

అతను ఇల్లు చేరేసరికి, ముద్దలు ముద్దలుగా పడ్డ ప్రింటింగ్ ఇంకులా ఉంది చీకటి. ఆఖరు కావస్తున్న సిగరెట్టు రెండు మూడు దమ్ములు లాగి పారేసి–హడావిడి బైండరులాగ, అర్జంటు కీర్తిలాగ తలుపుతట్టాడు కార్తవీర్యుడు తలుపులు తెరుచుకుంది.

"పాప పడుకుందా సీతా?" అని అడిగాడు.

"అప్పుడే ఎక్కడ? మీరు తెచ్చిన కారప్పూసపొట్లం అందుకోవద్దూ? అంటూ ఉండగా, పాప కళ్లు నలుపుకుంటూవచ్చింది – చదివి చదివి అలిసిపోయిన ప్రూఫ్‌రీడర్లాగ.

"దా పాపా! నీకోసం ప్రూపులు తెచ్చాను!" అన్నాడు కార్తవీర్యుడు. పాపకి దుఖం వచ్చింది. "ఒద్దు! అమ్మ కొత్తుతుంది." అంది పాప, తల తిప్పుతూ.

"కొట్టొద్దని నేను చెబుతాగా!"

"రేపో ఎప్పులో కొత్తుతుంది!"

"పోన్లె! నేనే దాచేసుకుంటాను!" అంటూ అతను లోపలికి వెళ్ళిపోయాడు.

మర్నాడు అతనికి పులపరం వచ్చింది మాధవరావుద్వారా సెలవుచీటి పంపి, ముసుగు తన్నిపెట్టి పడుకున్నాడు. నాలుగయిదు రోజులుపాటు కొండల్రావు గారి గొడవే పట్టించుకోలేదు. పథ్యం తిన్నాక వాళ్ళింటికి వెళ్ళాడు, ఆఫీసుకు పోతూపోతూ, ఆయనగా రూళ్ళో లేరని చెప్పాడు నూకరాజు.

ఆ వెళ్ళడం, వెళ్ళడం, కొండల్రావు గారు కొన్ని వారాలదాకా తిరిగి రాలేదు. ఈ లోగా 'ఆంధ్ర సాహిత్యంలో అబల' అనే థీసిస్ కన్య అందంగా ముస్తాబయింది. నలుగు రెదటా దాన్ని ఓ మంత్రి గారు ఫొటోకోసం ముసిముసిగా నవ్వుతూ–ఆవిష్కరించారు. ఆయన ఆవిష్కరించినదాని పట్టి నిలబెట్టి ఓ సాహిత్య పురోహితుడు ఎడాపెడా వర్ణించాడు. వధూవరు లిద్దరి ప్రవరా చెప్పాడు. తదనంతరం, వరుడు "మాంగ[illegible]ం తెంతునానేను–మమ జీవనహేతునా?" అంటూ ఆ కన్యని చేపట్టాడు. తరవాత కొన్నాళ్ళకి, ప్రతుల డెలివరీ కూడా అయింది.

ఈ లోపుగా కార్తవీర్యుడు రాత్రిళ్లు

టీలూ సిగరెట్లూతాగి పుస్తకం రాయడం పూర్తి చేశాడు. కొండల్రావుగారు సూచించిన వాటికితోడు, తాను మరికొన్ని అంశాలు కూడా జోడించి దాన్ని విపులంచేశాడు. తనని ఒత్తిడిచేసి ఇంత పని చేయించినందుకు కొండల్రావు గారికే దాన్ని అంకితమిచ్చి సర్ప్రయిజ్ చెయ్యాలనుకున్నాడు.

పదివేల రొక్కం వంచేలకర్పించిన లింగయ్యసేటు, వర్కర్ల కియ్యవలసిన డబ్బు ఏరోజుకారోజు వాయిదా పెడుతూనే వచ్చాడు వాళ్లు ఎదురు తిరిగే దాకా పరిస్థితి ముదరబెట్టి, అప్పు డింక గత్యంతరం లేక, మిషను తాకట్టు పెట్టి బకాయిలు కొన్ని చెల్లించాడు.

ఊరినించి వచ్చిన మర్నాడు, ప్రెస్సుకు ఫోన్ చేసి సాయంత్రం ప్రూఫులు తీసుకు రమ్మన్నాడు కొండల్రావుగారు. కార్తవీర్యుడు వెళ్లాడు బొత్తిగా కనిపించడమే మానేశా వేమిటోయ్?" అనిపించుకున్నాక ఈ మాటా ఆమాటా అయాక, ప్రూఫులు దిద్దడం అయాక, అతనేదో చెప్పబోతూ ఉండగా టక్కుమని ఆపి తన బ్రీఫ్ కేసు తెరిచాడు కొండల్రావుగారు. అందులోంచి ఒక పుస్తకంతీసి అతనికి అందించాడు.

'ప్రింటలాజికల్ ప్రూఫిస్టిక్' అని చదువుకున్నాడు కార్తవీర్యుడు.

"ఈ మధ్యే రాశానోయ్! ఎదో పని మీద మెడ్రాసులో ఉండిపోయి అక్కడే అచ్చు వేయించాను. అంతర్జాతీయ పుస్తక సంవత్సరం వస్తోంది కదూ, ఆ సందర్భంగా రాశాను. యునెస్కో వాళ్ళు వాళ్ళ ప్రచురణకింద తీసుకున్నారు దీన్ని?" అన్నాడాయన.

'ట్రాన్స్‌లేటెడ్ బై ది అథర్ ఫ్రమ్ది తెలుగు ఒరిజినల్' అన్న లైనుమీద అతని చూపు నిలబడ్డం చూసి, "అలా ఎందుకు వేశాననుకున్నావు? ఇంటర్నేషనల్ లెవెల్‌లో తెలుగు భాష పేరు మోగిపోవాలని. ప్రూఫ్ మీదే ఇలాటి మౌలిక రచనలుంటే తక్కిన శాస్త్రాల్లో ఇంకెంత గొప్ప పుస్తకాలు ఉన్నాయో నని వాళ్ళు డంగైపోవాలి. మనవాళ్ళు రాసిన శాస్త్రాలు మనవాళ్ళకి ఎలాగా అక్కర్లేదు కనక, వాళ్ళైనా వాటిని అనువాదం చేసుకుని, ఏ ఫ్రెంచిలోనో రష్యన్ లోనో ప్రచురిస్తే మనవాళ్ళు వాటికి ఇండియన్ ఎడిషన్లు వేయించి చదువు కుంటారు కదా!" అన్నాడు కొండల్రావు గారు. కుట్టువిడిపోయిన పుస్తకంఅట్లా నవ్వాడు కార్తవీర్యుడు కాని, మిషన్ల మీద బెల్టులా తిరుగుతోం దతనిచూపు చెయి జాయిన స్టోన్‌లా వికలమయి పోయింది మనస్సు

రెండు ఎమ్‌ల కూడా వదలకుండా మళ్ళీమాట్లాడినవాడు కొండల్రావుగారే!

"జ్వరపడ్డాక బాగా ఢీలా పడిపోయావోయ్! పాపం వెళ్ళిరా! తక్కిన







ప్రూఫులసంగతి తరవాత చూద్దాం పోనీ!" అన్నాడు.

కార్తవీర్యుడు ఇంటికీ వెళ్ళేసరికి పాప ఎదురొచ్చింది. గుప్పిడి విప్పి చూపించి, 'నాన్నా! నాకు కొలప్పు సోట్!" అంటూ ఊరించింది.

"నాకు పెట్టవా పాపా?" అంటూ దగ్గిరికి చేరాడతను.

"పెత్తుతానుందు మరీ!" అంటూ చెయ్యి వీలయినంత పైకెత్తి తన చేతి లోది నాన్న నోట్లో పోసింది.

"అమ్మకో మరి?"

"నేను పెత్త! నన్ను కొత్తిందిగా!"

అంది పాప బుంగబుంగ మూతి పెట్టి.

"మరి ఆమ్మే కొనిపెట్టిందిగా నీకు!"

"ఏంకాదు! మామ్మ కొని పెత్తింది! మామ్మ ఎంతో మంచిది?"

"అయితే మామ్మకి పెట్టావా?"

"మామ్మ లెక్కలేనా కొలప్పాస తింతాలేం?" అంటూ కళ్ళు మిలమిల్లాడించింది.

"అయితే మనిద్దరమే తిందాం!

బొబ్బ పోసుకుని వస్తానేం?" అంటూ పాపని ఎత్తుకుదింపి లోపలికి వెళ్ళాడు.

అతను స్నానంచేసి, భోంచేసి వచ్చే వేళకు పాప నిద్రపోయింది. వాళ్ళ మామ్మదగ్గిర. సీత ఇల్లు సవరించుకుని వచ్చింది.

ఈలోగా అతను గోడకు చేరబడి ఇంటికి తెచ్చిన ప్రూఫు చదువుతూ ఉంటే ఇంపోజ్ చేసిన ఫారాలకు పిన్నులు దిగొడుతున్నట్టు వీపుమీద చీమలు పుటుకూ పుటుకూ కుట్టడం మొదలెట్టాయి. వెనక్కి తిరిగిచూస్తే పెద్ద బారు కనిపించింది. గాలిలో లైను లాగ! 'ఈ లైనుకు మొదలెక్కడా?' అని పరిశోధన చేస్తే కిటికీలో మూల కనిపించింది పాపదాచుకున్నకారప్పూస పొట్లం, చీమలు దులిపేద్దామని పొట్లం తీశారు. దీపం దగ్గిర పెట్టి పొట్లం విప్పాడు అందులో అతనికి కనిపించింది కారప్పూస కాదు-తను రాసిన ప్రూఫ్ శాస్త్రంలో వాక్యాలు-ప్రూఫ్ విరహమూ ఎట్ సెట్రా!

"సీతా!" అంటూ పిలిచాడతను.

"ఊఁ!" అందామె.

"ఈ కాయిత మిక్కడి కెలా వచ్చింది?"

సీత కిలకిలా నవ్వింది, "బలేవారే! చూస్తూ నన్నడుగుతారే. పాపాయి కరప్పూస పొట్లం కదుసిందీ!"

"ఔను, ఈ కాయితాన్ని కారప్పూస పొట్లంగా కట్టింది ఎవరంటున్నాను?"

"బాగుంది! వీదిలో కారప్పూస అమ్మే వాడే కట్టాడు!"

"ఇది వాడిదగ్గిరికెలా వెళ్ళింది?"

"నాకేం తెలుసు? మీ అమ్మాయికీ మీ అమ్మగారికీ తెలియాలి! ప్రూఫ్‌ల పిచ్చి వదిలి కారప్పూస పిచ్చి పట్టింది దానికి కొనిపెడదామంటే నాదగ్గిర డబ్బు ల్లేవు! సాయంత్రం నాన్నగారొచ్చు కొంటానే తల్లీ! అంటే ఊరుకోలేదు. ఇల్లు పీకి పందిరేసింది, అప్పుడు మీ అమ్మగారు, గూట్లో పనికిరాని కాయితా లుంటే పట్టికెళ్ళి బండివాడికిచ్చేసి పాప కింత కారప్పూస కట్టించి పెట్టారు. ఏమయిందిప్పుడు?" అని అడిగింది సీత

కార్తవీర్యుడు అప్పటికి నేలమీద కాలు మోపాడు.

"అబ్బే! ఏంకాలేదు సీతా! ఆ కాయితాలు వెళ్ళవలసిన చోటికే వెళ్ళాయి!" అంటూ తేలికగా నవ్వేసి, పాప కారప్పూస ఒక డబ్బాలో పోసి దాచి, ఆ కాయితం ఉండచుట్టి కిటికీలోంచి విసిరేసి, దీపం తగ్గించాడు

"ఏం? పాపం అప్పుడే తగ్గించారు! ప్రూఫులు దిద్దుకోడానికి వెలుగు చాలదేమో?" అంది సీత గొంతులోని వెటకారం.

"ఏం? ఈ పైపుకి ఈ వెలుగు చాలదంటావా?" అంటూ సున్నితంగా చిటిక వేశాడు సున్నితమైనచోట.

అప్పుడు సీత కళ్ళలో వెలిగిన వెలుగు, దీపాన్ని మరింత చిన్న బుచ్చింది!

———



# కడలి - కెరటం * కాశీపు వీరభద్రుడు

E.R.KUMAR

"క్రిష్ణా, యిది నాటకం కాదు. నిజ జీవితం. రెండు మూడ్రోజు ల్నుంచి చూస్తున్నాను. ఆ సితారువాడి వ్యవహారం నాకేమీ నచ్చలేదు."

"ఎందుకండీ అంత భయం. నా జాగ్రత్తలో నేను లేనటండీ!" క్రిష్ణవేణి తన భర్త వేణుతో అంది.

"ఉన్నావున్నావ్. తీరా ఆ పరిస్థితే వస్తే మీ ఆడవాళ్ళేం చెయ్యగల్రు!" నీరసంతో ఉన్నా కొంచెం ఆవేశంగానే అన్నాడు వేణు

"అబ్బా, మీరు కొంచెం విశ్రాంతి తీసుకొందురూ. ఎంత ఆయాసపడుతున్నారో చూసేరా. మీ ఆరోగ్యం కొంచెం కుదుటపడితే మనమిక్కడ్నుంచి మరే ఊరన్నా పోదాం."

"అంతవరకూ వీడ్నిలా......"

"మీ పుణ్యముంటుంది బాబూ, మాట్లాడకుండా కాస్త విశ్రాంతి తీసుకోండి. వాడి సంగతి నేను చూసుకొంటాను."

"ఏమిటి చూసుకొంటావో ... " ఆయాసంతో వేణు అటువేపు తిరిగి పడుకున్నాడు-మరి మాట్లాడేశక్తి లేక కొంచెం చలిగాఉంటే అతని వంటినిండా దుప్పటి కప్పింది. కారుతూన్న కన్నీటిని మధ్యమధ్య పైటచెంగుతో తుడుచుకుంటూ క్రిష్ణవేణి వేణుపాదాలు పట్ట సాగింది.